క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

పమిడిముక్కల: పమిడిముక్కల, కృష్ణాపురం సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో శనివారం ఉదయం 8 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాసరావు తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు. పెనుమత్స గ్రామంలో జగనన్న కాలనీకు విద్యుత్ లైన్స్ వేయటానికి ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలియజేశారు.

నేడు కులగణనపై సమావేశం

పెదపారుపూడి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం మధ్యాహ్నం కులగణనపై సమీక్షా సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో టి.సీతామహాలక్ష్మి శుక్రవారం తెలిపారు. ఎంపీపీ గోగం సురేష్ అధ్యక్షతన సమావేశం జరుగుతుందన్నారు.

ఇన్వర్టర్ వితరణ

పెదపారుపూడి: ఎంఈఓ కార్యాలయానికి యలమర్రు హైస్కూల్ హెచ్‌ఎం ఆర్.వరుణ్‌కుమార్ శుక్రవారం ఎంఈఓ బి.శ్రీనివాస్‌కు సుమారు రూ.20వేల విలువ కలిగిన ఇన్వర్టర్‌ను వితరణగా అందించారు. కార్యక్రమంలో ఎంఈఓ సురేష్, సీఆర్పీలు పాల్గొన్నారు.

నేటి నుంచి గంగానమ్మ జాతర

తోట్లవల్లూరు: భద్రిరాజుపాలెంలో పోతురాజు, గంగానమ్మ జాతర నేటి నుంచి ప్రారంభం కానుంది. శనివారం గ్రామంలో పోతురాజు గెడ ఊరేగింపు, పోతురాజు గుడి వద్ద పాల పొంగళ్ల కార్యక్రమాలు జరుగుతాయి. ఆదివారం గంగానమ్మ తల్లికి ప్రత్యేక పూజలు, మొక్కుబడుల చెల్లింపు జరుగుతుంది.

రేపటి నుంచి యూటీఎఫ్ కౌన్సిల్ సమావేశాలు

గుడివాడటౌన్: యూటీఎఫ్ కృష్ణాజిల్లా 48వ కౌన్సిల్ సమావేశాలు ఈనెల 19వ తేదీన నిర్వహిస్తున్నట్లు యూటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు నీలం ప్రభాకరరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక కాపు కల్యాణ మండపంలో పెదపారుపూడి యూటీఎఫ్ శాఖ ఆధ్వర్యంలో జరిగే ఈ సమావేశాలకు యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి కేఎస్ఎస్ ప్రసాద్, ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, మాజీ ఎమ్మెల్సీ బొడ్డు నాగేశ్వరరావు తదితరులు పాల్గొంటారన్నారు.

రహదారి నిర్మాణం పరిశీలన

అడ్డాడ(పామర్రు): స్థానిక ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ చొరవతో గ్రామంలో అంతర్గత రహదారి ఏర్పాటు అవుతున్నట్టు గ్రామ సర్పంచ్ పామర్తి త్రినేత్రి తెలిపారు. అడ్డాడ ఓసీ కాలనీలో జరుగుతున్న పనులను శుక్రవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో ఎమ్మెల్యే గ్రామంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గ్రామస్తులు అంతర్గత రహదారులు ఏర్పాటు చేయాలని కోరిన మేరకు గ్రామానికి రూ.10 లక్షల నిధులను మంజూరు చేశామన్నారు. ఆ నిధులతో గ్రామంలోని అంతర్గత రహదారులు ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు.

నేడు రామమందిరం ప్రారంభం

పమిడిముక్కల: కృష్ణాపురం శివారు మగ్గాన మాలపల్లిలో తిరుమల తిరుపతి దేవస్థానం, గ్రామస్థుల సహకారంతో నూతనంగా నిర్మించిన శ్రీ కోదండ రామ మందిరంను శనివారం ఉదయం 9:36 గంటలకు ప్రారంభించనున్నట్లు ఆలయ కమిటీ వారు తెలిపారు. శ్రీ హనుమత్ లక్ష్మణ సమేత కోదండ రామ స్వామి వార్ల విగ్రహ, ఆలయ శిఖర ప్రతిష్టా మహోత్సవం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. టీటీడీ రూ.10 లక్షలు, గ్రామస్తులు, భక్తుల నుంచి మరో రూ.10 లక్షల విరాళాలు సేకరించి మందిరాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. ఎమ్మెల్యే కై లే అనిల్‌కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొంటారని చెప్పారు.

రైల్వేగేటు మూసివేత

కైకలూరు: రైలు పట్టాల మరమ్మతుల నిమిత్తం మండవల్లి – కైకలూరు రైల్వే ట్రాక్ రూటులో నంబరు 81 కోరుకొల్లు గేటును మూడు రోజులు మూసివేస్తున్నట్టు సౌత్ సెంట్రల్ రైల్వే కైకలూరు సీనియర్ సెక్షన్ ఇంజనీరు ఎం.శివప్రసాద్ శుక్రవారం తెలిపారు. ఈ నెల 20వ తేదీ ఉదయం 7 నుంచి 22వ తేదీ రాత్రి 7 గంటల వరకు మూసివేయనున్నట్లు వివరించారు.

మొవ్వలో కేంద్ర బృందం పరిశీలన

మొవ్వ: మొవ్వ గ్రామంలో రూ.2.55 కోట్లతో జలజీవన్ మిషన్ ద్వారా సరఫరా అవుతున్న ఇంటింటి కుళాయి పని తీరును న్యూఢిల్లీ లోని కేంద్ర సచివాలయ అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్స్ బృందం పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. న్యూఢిల్లీ నుంచి విచ్చేసిన శ్రేష్టి భాటియా, వన్షిక ఠాగూర్, శుభం చౌహాన్, శివకుమార్ భరద్వాజ్, సాగర్ రావత్ శుక్రవారం మండల ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కేఎస్ఆర్ ప్రసాద్ ద్వారా దీనికి సంబంధించిన పలు వివరాలను సేకరించి నమోదు చేసుకున్నారు. మొవ్వ–1 సచివాలయాన్ని, జగనన్న కాలనీని, శ్రీ మండవ కనకయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న మధ్యాహ్న భోజనాన్ని, ల్యాబ్‌లను పరిశీలించారు. విద్యార్థులు ప్రదర్శించిన కూచిపూడి నాట్యాన్ని తిలకించారు. అనంతరం మహాకవి క్షేత్రయ్య ఆరాధ్య దైవమైన శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత శ్రీ వేణుగోపాల స్వామి దేవాలయంలో జరిగిన పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వారి వెంట నోడల్ ఆఫీసర్ అమీర్ బాషా, సర్పంచ్ తూము పూర్ణ చంద్రరావు, ఈవోపీఆర్‌డీ వీర్ల సీతారామరాజు, పంచాయతీ కార్యదర్శి కె.సోమేశ్వరరావులతో పాటు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నాగులచవితి వేడుకలు

గుడివాడటౌన్: నాగుల చవితి పర్వదినాన్ని శుక్రవారం భక్తులు అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకొన్నారు. స్థానిక ఎమ్మార్వో కార్యాలయం వద్ద గల నాగేంద్రస్వామి దేవస్థానంలో, ఆర్డీఓ కార్యాలయం వెనుక , బేతవోలు నిమ్మతోట వద్ద, బైపాస్ రోడ్‌లోని సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవస్థానాలలో గల పుట్టలలో భక్తులు పాలు పోసి పూజలు నిర్వహించారు. స్థానిక ఎమ్మార్వో కార్యాలయం వద్ద గల నాగేంద్రస్వామి వారి దేవస్థానంలో జూనియర్ సివిల్ జడ్జి గాయత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

గుడివాడ మండలంలో...

గుడివాడరూరల్: మండలంలోని పలు గ్రామాల్లో నాగుల చవితి వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. తెల్లవారు జాము 3 గంటల నుంచే నాగేంద్రస్వామి పుట్టలో పాలు పోసేందుకు పలు గ్రామాల్లోని ఆలయాలకు చేరుకుని స్వామివారికి పూజలు చేసి నైవేద్యాలు సమర్పించారు. మండలంలోని దొండపాడు, మోటూరు, చౌటపల్లి, గుంటాకోడూరు, మల్లాయపాలెం, బొమ్ములూరు, రామనపూడి, బిళ్లపాడు, తటివర్రు, పర్నాస, కల్వపూడి అగ్రహారం తదితర గ్రామాల్లోని నాగేంద్రస్వామి ఆలయాల వద్ద తెల్లవారు జాము నుంచే భక్తులు క్యూలైన్లలో నిలబడి పుట్టలో పాలుపోసిన నాగేంద్రుడికి కోడిగుడ్లు సమర్పించారు. గుడివాడ తహసీల్దార్ కార్యాలయం వద్ద నాగేంద్రస్వామి ఆలయం తెల్లవారు జాము నుంచే భక్తులు పాలు పోసేందుకు తరలివచ్చి తమ మొక్కులను చెల్లించుకున్నారు. ఆయా ప్రాంతాల్లో భక్తుల సందడితో కోలాహలంగా నాగులచవితి వేడుకలు ఘనంగా జరిగాయి.

తోట్లవల్లూరులో...

తోట్లవల్లూరు: నాగులచవితి పర్వదిన వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకొన్నారు. ఉదయాన్నే పవిత్ర స్నానాలను ఆచరించి నూతన వస్త్రాలను ధరించి పుట్టలలో పాలు పోసి పూజలు నిర్వహించారు. వేణుగోపాలస్వామి ఆలయం, శివాలయం, కనకదుర్గమ్మ కాలనీ, పడమట బాబూరావు ఇంటి వద్ద, లైన్‌బజార్, రజకపేట, తదితర ప్రాంతాల్లోని నాగుపుట్టల వద్ద ప్రజలు భక్తి,శ్రద్ధలతో పూజలు జరిపారు. ఆయా పుట్టలలో ఆవుపాలు పోయటంతో పాటు కోడిగుడ్లు, చలిమిడి, వడపప్పు నైవేద్యంగా సమర్పించారు.

మొవ్వలో...

మొవ్వ: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం నాగుల చవితి వేడుకలను అత్యంత భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. వేకువ జామునుంచి భక్తులు పెద్ద ఎత్తున గ్రామాల్లోని పుట్టల వద్దకు వెళ్లి పూజలు నిర్వహించి ఆవు పాలు పోసి మొక్కులు తీర్చుకున్నారు. అయ్యంకి, పెదపూడి, గూడపాడు, మొవ్వ, కూచిపూడి, కోసూరు, కాజ, వేములమడ, యద్దనపూడి తదితర గ్రామాల్లోని పుట్టల వద్ద భక్తులు బారులు తీరారు. శివాలయాల్లో, విష్ణాలయాల్లో గల నాగేంద్రుని విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

పామర్రులో...

పామర్రు: నాగుల చవితి సందర్భంగా స్థానిక గంగానమ్మ తల్లి ఆలయం వద్ద, సోమేశ్వరస్వామి ఆలయం, బుచ్చమ్మతల్లి ఆశ్రమం లోని నాగేంద్రస్వామి పుట్టలో భక్తులు ఆవు పాలు పోసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాగేంద్రస్వామికి అత్యంత ఇష్టమైన కోడిగుడ్లు, అరటిపండ్లు, చలిమిడి తదితరాలను సమర్పించారు. నాగేంద్రస్వామి వారి ప్రసాదంగా పుట్ట మన్నును స్వీకరించారు. మండల పరిధిలోని కొమరవోలు, జమీదగ్గుమిల్లి, రాపర్ల, బల్లిపర్రు, జుఝువరం, అడ్డాడ తదితర గ్రామాల్లోని నాగేంద్రస్వామి పుట్టల వద్ద మహిళలు బారులు తీరి పూజలు నిర్వహించారు.

మండవల్లిలో...

మండవల్లి: మండలంలోని గ్రామాల్లో శుక్రవారం నాగులచవితి పండుగ భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేకువజామున నుంచి పొలాల్లోని పుట్టలలో పాలు పోయడానికి కుటుంబ సమేతంగా వెళ్లారు.

వానపాములలో...

వానపాముల(పెదపారుపూడి): మండలంలోని వానపాముల పొలిమేరలో నాగేంద్ర స్వామి ఆలయంలో ఉన్న పుట్టలో మహిళలు శుక్రవారం పాలు పోసి కోడిగుడ్లు, చలివిడి, పెట్టి పూజలు చేశారు. పెదపారుపూడి నాగేంద్ర స్వామి ఆలయంలో పుట్ట వద్ద పాలు పోసి పూజలు చేశారు.



గుడివాడ తహసీల్దార్ కార్యాలయం వద్ద పూజల్లో పాల్గొన్న జూనియర్ సివిల్ జడ్జి గాయత్రి



పామర్రులో నాగేంద్రస్వామి పుట్టలో పాలు పోస్తున్న భక్తులు



తోట్లవల్లూరులో పుట్ట వద్ద పూజలు నిర్వహిస్తున్న భక్తులు



మొవ్వ మండలం గూడపాడు గ్రామంలో పుట్టలో పాలు పోస్తున్న భక్తులు

సింగరాయపాలెంలో...



ముదినేపల్లి రూరల్: ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం–చేవూరుపాలెం సెంటర్లోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయానికి శుక్రవారం భక్తులు పోటెత్తారు. మహిళలు నాగబంధాల వద్ద దీపాలు వెలిగించి పూజలు చేశారు. ఆలయ చైర్మన్ శౌంఠి నాగరాజు, సహాయ కమిషనర్ నేల సంధ్య, పాలకవర్గ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. హైదరాబాద్‌కు చెందిన మెండు వెంకట రమణరావు అంతరాలయ ముఖద్వారానికి వెండి తాపడం నిమిత్తం రూ.10,116 విరాళంగా అందజేశారు. సింగరాయపాలెం బాబాజీ మఠంలోని స్వామివారి పుట్టలో పాలు పోసి ఈఓ శింగనపల్లి శ్రీనివాసరావు ఉత్సవాలను ప్రారంభించారు. నరసన్నపాలెం, పెదకామనపూడి, చినకామనపూడి, ముదినేపల్లి, పెదగొన్నూరు తదితర గ్రామాల్లోని సుబ్రహ్మణ్యేశ్వర, నాగేంద్రస్వామి ఆలయాలు నాగులచవితి సందర్భంగా భక్తులతో కిటకిటలాడాయి.

రోలర్ స్కేటింగ్‌లో విశ్వభారతి విద్యార్థుల ప్రతిభ

గుడివాడటౌన్: రోలర్ స్కేటింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా 35వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని ఇటీవల నిర్వహించిన స్కేటింగ్ పోటీలలో విశ్వభారతి ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు పలు పతకాలు సాధించినట్లు విశ్వభారతి విద్యా సంస్థల చైర్మన్ పొట్లూరి శ్రీమన్నారాయణ తెలిపారు. బహుమతులు సాధించిన విద్యార్థులను శుక్రవారం ఆయన అభినందించారు. ఈ సందర్భంగా శ్రీమన్నారాయణ మాట్లాడుతూ తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు వివిధ విభాగాలలో ఎనిమిది స్వర్ణ, రజత, కాంస్య పతకాలు సాధించగా కె.శ్యామ్, జి.గాయత్రి జాతీయ స్థాయి పోటీలకు అర్హత సాధించారన్నారు. విజేతలను ప్రిన్సిపాల్ ఎల్.శ్రీజ్యోతి, ఉపాధ్యాయులు అభినందించారు.



విజేతలైన విద్యార్థులతో ప్రిన్సిపాల్, వ్యాయామ ఉపాధ్యాయులు

కరాటేలో షైనింగ్ స్టార్ విద్యార్థుల ప్రతిభ

గుడివాడరూరల్: నేషనల్ ఓపెన్ కరాటే పోటీల్లో షైనింగ్ స్టార్ విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబర్చి పతకాలు సాధించారని పాఠశాల ప్రిన్సిపాల్ లింగమనేని స్రవంతి తెలిపారు. పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు నిర్వహించిన అభినందన సభలో ఆమె మాట్లాడుతూ 22వ నేషనల్ ఓపెన్ కరాటే చాంపియన్ షిప్–2023లో ఆన్‌లైన్ పార్టిసిపేషన్ చేసి తమ పాఠశాల విద్యార్థులు విజయం సాధించారన్నారు. 9, 10, 11 సంవత్సరాల వయో విభాగంలో కటాలో జాహెద్, మనశ్విత్ ముఖర్జీ మన్నే, మోహిత్‌నంద, రవిచంద్, తేజ రాఘవన్, సాత్విక్ వరుసగా స్వర్ణ, రజత, కాంస్య పతకాలు సాధించారన్నారు. పతకాలు సాధించిన విద్యార్థులను, కోచ్ రామకృష్ణను ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ లింగమనేని జగదీష్, అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



కరాటేలో పతకాలు సాధించిన విద్యార్థులతో ప్రిన్సిపాల్ స్రవంతి, అధ్యాపకులు

ఇంటింటికీ ఇంటర్‌నెట్

–ఏపీ ఫైబర్‌నెట్ చైర్మన్ గౌతంరెడ్డి

తోట్లవల్లూరు: రాష్ట్రంలో ఇంటింటికీ ఫైబర్‌నెట్ కనెక్షన్ ఇవ్వాలనేది సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆలోచన అని, దీనిలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా సుమారు కోటి కనెక్షన్లు ఇచ్చే విధంగా ఏపీ ఫైబర్‌నెట్‌ను ఆధునికీకరించినట్లు ఏపీ ఫైబర్ నెట్ కార్పొరేషన్ చైర్మన్ పూనూరి గౌతంరెడ్డి తెలిపారు. మండలంలోని భద్రిరాజుపాలెం గ్రామానికి ఓ శుభకార్యంలో పాల్గొనేందుకు వచ్చిన ఆయన స్థానిక గ్రామ సచివాలయాన్ని సందర్శించారు. సచివాలయంలో సేవల వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ రూ.350 ప్యాకేజీలో కేబుల్ టీవీ, ఇంటర్‌నెట్, టెలిఫోన్ సౌకర్యం ఇస్తున్నట్లు చెప్పారు. కేవలం ఇంటర్‌నెట్ మాత్రమే కావాలనుకునే వారికి రూ.190కే ఇవ్వనున్నట్లు చెప్పారు.

భక్తులకు ఉచితంగా ఆవుపాలు పంపిణీ

పామర్రు: స్థానిక పాల సేకరణ కేంద్రం అధ్యక్షుడు బొమ్మారెడ్డి కృష్ణారెడ్డి తన సొంత నిధులతో ఆవుపాలను కొనుగోలు చేసి నాగులచవితి సందర్భంగా గ్రామంలోని భక్తులందరికీ ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్థానికులు ఆరేపల్లి శ్రీనివాసరావు, బొమ్మారెడ్డి మాధవరెడ్డి, మర్రెడ్డి అంజిరెడ్డి, ఆరుమళ్ల శ్రీనాథ్‌రెడ్డి, తాడిశెట్టి శ్రీనివాసరావు, హస్మతుల్లా, కందుల నరసింహారావు, సజ్జా సుబ్రమణ్యం, భక్తులు పాల్గొన్నారు.

సంక్షేమ పాలనకు జగనన్నే కావాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డీఎన్నార్

ముదినేపల్లి రూరల్: రాష్ట్రంలో అన్ని వర్గాల సంక్షేమానికి పాటుపడుతున్న ముఖ్యమంత్రిగా జగనన్న పాలన దీర్ఘకాలం కొనసాగాలని ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. మండలంలోని గురజలో శుక్రవారం ఏపీకి జగన్ ఎందుకు కావాలి కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేయడంతో పాటు ఇవ్వని హామీలను సైతం అమలు చేసిన జగనన్నను ప్రజలంతా ఆశీర్వదించాలని కోరారు. అనంతరం స్థానిక పీహెచ్‌సీలో అదనపు భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంజూరైన నిధులతో నిర్మించిన సీసీ డ్రెయిన్లను ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ, జెడ్పీటీసీ సభ్యురాలు ఈడే వెంకటేశ్వరమ్మ, హౌసింగ్ కార్పొరేషన్ డైరెక్టర్ గంటా సంధ్య, వైస్ ఎంపీపీ రాచూరి రాధా, సర్పంచ్ మంచాల సరస్వతి, సొసైటీ అధ్యక్షుడు మేడూరి వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు మోట్రు ఏసుబాబు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలులో పరస్పర సహకారం అవసరం

ఆర్డీఓ పద్మావతి



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ పద్మావతి

గుడివాడటౌన్: రైతులు పండించిన పంటను కొనుగోలు చేసే విషయంలో రైస్ మిల్లర్‌లు, అధికారులు, రైతుల మధ్య పరస్పర సహకారం, అవగాహన అవసరమని ఆర్డీఓ పి.పద్మావతి అన్నారు. పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ ఎ.శ్రీధర్‌తో కలిసి శుక్రవారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సమావేశం హాలులో రెవెన్యూ, వ్యవసాయ, పౌర సరఫరాలు, కో–ఆపరేటివ్ శాఖల అధికారులు, రైస్ మిల్లర్లతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు ఆన్‌లైన్ బుకింగ్ విధానం అమలవుతుందన్నారు. రైస్ మిల్లర్‌లు వారు కొనుగోలు చేసే ధాన్యం లక్ష్యాన్ని బట్టి ముందుగానే మార్కెట్ యార్డుకు గోనె సంచులు తరలించాలన్నారు. అవి ఆర్బీకేలకు చేరిన అనంతరమే ధాన్యం సేకరణకు ఆన్‌లైన్ ఓపెన్ అవుతుందన్నారు. ఇక ఆర్బీకేలో టెక్నికల్ అసిస్టెంట్‌లు వ్యవసాయ క్షేత్రంలోకి వెళ్లి ధాన్యం తయారైన తదుపరి సంచులు రైతుకు అందజేస్తారన్నారు. వాహనాలు జియో ట్యాగింగ్ చేస్తామని, రైతులు తమ సొంత వాహనాలలో కూడా ధాన్యం తరలించేందుకు అనుమతులు ఇస్తామన్నారు. అయితే ముందుగా వారి వాహనాలను జియో ట్యాగింగ్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. ఈ ప్రక్రియ ఇప్పటికే ప్రారంభించామని తెలిపారు. ధాన్యం తేమ నమూనాలు తీసుకునే విషయంలో ఇప్పటివరకు ఎదురైన సమస్యల పరిష్కారానికి కొత్త విధానం అమలు చేస్తున్నామన్నారు. ఆర్బీకేల నుంచి ధాన్యం తరలిస్తున్న సమయంలో తీసిన తేమ శాతాన్ని పరిగణనలోకి తీసుకుంటామని, అప్పుడు రైస్ మిల్లర్‌కు, రైతుకు మధ్య తేమ వ్యత్యాసం ఉండదన్నారు. సమావేశంలో తహసీల్దార్ కె.ఆంజనేయులు, అన్నిశాఖల అధికారులు, రైస్‌మిల్లర్లు పాల్గొన్నారు.

గ్రంథాలయాల్లో విద్యార్థులకు వివిధ పోటీలు



ముదినేపల్లి శాఖా గ్రంథాలయంలో వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు



తాడంకి హైస్కూల్‌లో వ్యాసరచన పోటీలను పర్యవేక్షిస్తున్న గ్రంథపాలకుడు సాంబశివరావు

పమిడిముక్కల: అగినపర్రు గ్రంథాలయంలో విద్యార్థులకు చిత్రలేఖనం, కబడ్డీ, వాలీబాల్ పోటీలు, తాడంకి హైస్కూల్‌లో విద్యార్థులకు వ్యాసరచన, రన్నింగ్ పోటీలు, పెనుమత్సలో విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్ పోటీలు నిర్వహించినట్లు గ్రంథపాలకులు లావణ్య, సాంబశివరావు, సుబ్బారావు తెలిపారు.

విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు

గుడివాడటౌన్: స్థానిక షా గులాబ్‌చంద్ ప్రథమ శ్రేణి గ్రంథాలయంలో గ్రంథాలయ అధికారి బీరం వెంకట రమణ ఆధ్వర్యంలో, రాజేంద్రనగర్ శాఖా గ్రంథాలయంలో ఇన్‌చార్జ్ పి.శాంతి ఆధ్వర్యంలో, నందివాడ శాఖా గ్రంథాలయం ఇన్‌చార్జ్ లంకపల్లి జయరాజు ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. తమిరిశ గ్రంథాలయంలో జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం ప్రసాద్ పోటీలను పర్యవేక్షించారు. గ్రంథాలయ ఇన్‌చార్జ్ శివకుమార్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గురుకుల పాఠశాల విద్యార్థులకు పోటీలు

గుడివాడరూరల్: మోటూరు గ్రంథాలయ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం గురుకుల పాఠశాల విద్యార్థులకు రన్నింగ్, చెస్, క్యారమ్స్, వ్యాసరచన పోటీలను నిర్వహించినట్టు గ్రంథాలయ అధికారి గొట్టిపాటి గోపాలకృష్ణ తెలిపారు.

మాతృభాషపై విద్యార్థులకు అవగాహన

పెదపారుపూడి: పెదపారుపూడి గ్రంథాలయంలో శుక్రవారం మండల ఈవోపీఆర్డీ వి.శ్రీనివాసరావు విద్యార్థులకు మాతృభాషపై అవగాహన కల్పించారు. గ్రంథాలయాధికారి ఎంపీఎస్ శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. యలమర్రు గ్రంథాలయంలో విద్యార్థులకు క్విజ్ పోటీలను నిర్వహించారు. గ్రంథాలయాధికారి రవిచంద్ర పాల్గొన్నారు.

జమీగొల్వేపల్లిలో...

పామర్రు: జమీగొల్వేపల్లి శాఖా గ్రంథాలయంలో శుక్రవారం విద్యార్థులకు ఆటల పోటీలు, వ్యాసరచన, చిత్ర లేఖనం, వక్తృత్వ పోటీలను నిర్వహించారు. గ్రంథాలయ అధికారి వి.నాగసురేష్, మహిళా మండలి అధ్యక్షురాలు గుమ్మడి ఉషాదేవి, యోగా గురువు పి.ధర్మా రావు పోటీలను పర్యవేక్షించారు. పామర్రులోని శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు పలు రకాల పోటీలను నిర్వహించినట్టు గ్రంథాలయ అధికారి జి.ఝాన్సీరాణి తెలిపారు.

విద్యార్థులకు వ్యాస రచన పోటీలు

ముదినేపల్లి రూరల్: స్థానిక శాఖా గ్రంథాలయంలో విద్యార్థులకు శుక్రవారం పర్యావరణం–పరిరక్షణ అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. వివిధ పాఠశాలల నుంచి 206 మంది విద్యార్థులు హాజరయ్యారు. అనంతరం 6, 7, 8 తరగతులు విద్యార్థులకు మ్యూజికల్ చైర్ పోటీలు నిర్వహించారు. జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎం వై.విజయకుమార్ వ్యాసరచన పోటీలను పర్యవేక్షించారు.

కైకలూరులో...

కైకలూరు: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా శుక్రవారం కై కలూరు శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ నిర్వాహకుడు కోరుమిల్లి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కవి సమ్మేళనం, రచయితల సందేశం, ఉర్దూ పాఠశాల విద్యార్థులకు పాటలు, చిత్రలేఖనం పోటీలను నిర్వహించారు. హైకోర్టు న్యాయవాది రుద్రపాక రత్నారావు, విశ్రాంత ఉపాధ్యాయులు సీహెచ్ పార్వతీశం, కల్యాణి న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు

తోట్లవల్లూరు: స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులకు శుక్రవారం వ్యాసరచన పోటీలు జరిగాయి. 3వ తరగతి నుంచి పదో తరగతి వరకు, ఇంటర్ విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని గ్రంథాలయాధికారి బాబూరావు పర్యవేక్షించారు.

సంక్షిప్త వార్తలు

27 నుంచి గుడివాడలో కులగణన

గుడివాడటౌన్: పట్టణంలో కులగణన కార్యక్రమానికి సచివాలయ ఉద్యోగులు సిద్ధం కావాలని మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ అన్నారు. స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సమావేశం హాలులో శుక్రవారం సచివాలయ ఉద్యోగులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 27 నుంచి కులగణన కార్యక్రమం ప్రారంభిస్తున్నామన్నారు. వార్డు వలంటీర్లు, సచివాలయ ఉద్యోగుల సమక్షంలో ఈ కులగణన జరుగుతుందన్నారు.

రేపు కైకలూరులో గౌడ సంఘ కార్తిక వన సమారాధన

కైకలూరు: ఈనెల 19న కైకలూరు నియోజకవర్గ గౌడ సంఘ కార్తిక వన సమారాధన ఆటపాక శివారు నాగాపురం ఆంజనేయస్వామి గుడి వద్ద నిర్వహించనున్నట్లు రాష్ట్ర గౌడ సంఘ నాయకులు పోసిన చెంచురామారావు, బొర్రా చలమయ్య శుక్రవారం తెలిపారు. ముఖ్య అతిథులుగా మంత్రి జోగి రమేష్, జెడ్పీ చైర్‌పర్సన్ ఉప్పాల హారిక, మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణ హాజరవుతారని పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కలిదిండి: విద్యుత్ సబ్‌స్టేషన్ అత్యవసర మరమ్మతుల నిమిత్తం కలిదిండి మండలంలో ఉదయం 8 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని గుడివాడ విద్యుత్‌శాఖ డీఈ రామకృష్ణ శుక్రవారం చెప్పారు. మండలంలో 33 కేవీ లైన్లు మరమ్మతులు చేయాల్సి ఉందన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు మొవ్వ మండల సర్వసభ్య సమావేశం

మొవ్వ: మండల కేంద్రం మొవ్వ గ్రామంలోని ఎంపీడీవో కార్యాలయంలో శనివారం మధ్యాహ్నం 3 గంటలకు మొవ్వ మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో జి.సుధాప్రవీణ్ తెలిపారు. ఎంపీపీ కొండేటి ఇందిర అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ పాల్గొంటారు.

నేడు కోసూరులో గడప గడపకు మన ప్రభుత్వం

మండలంలోని కోసూరు గ్రామంలో శనివారం నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు మొవ్వ మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు రాజులపాటి రాఘవరావు వెల్లడించారు. మధ్యాహ్నం 4 గంటల నుంచి జరిగే ఈ కార్యక్రమంలో పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొంటారని తెలిపారు.

జగనన్న గోరుముద్ద తనిఖీ

కలిదిండి: భాస్కరరావుపేట ఉన్నత పాఠశాలలోని జగనన్న గోరుముద్దను ఎంఈఓ పి.ప్రభాకర్ రావు, ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు శుక్రవారం పరిశీలించారు. హెచ్‌ఎం పాండురంగారావు, ఎంపీటీసీ పద్మ పాల్గొన్నారు.

మండవల్లిలో కవి సమ్మేళనం

మండవల్లి: మండవల్లి గ్రంథాలయంలో శుక్రవారం కవి సమ్మేళనం నిర్వహించారు. ముఖ్య అతిథిగా తెలుగు ఉపాధ్యాయుడు ఆర్‌వీఎల్ నరసింహారావు, రచయిత డీవీ నరసయ్య, తెలుగు ఉపాధ్యాయుడు మారేడు పూనారాజు, హైస్కూల్ హెచ్‌ఎం పీవీఎస్ఎస్‌జీ ప్రసాద్ పాల్గొన్నారు. గ్రంథాలయాధికారి షేక్ పర్వీనా, మండవల్లి హైస్కూల్ లైబ్రేరియన్ నాగమల్లేశ్వరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

నియోజకవర్గ బీజేపీ కన్వీనర్‌గా విష్ణురావు

కైకలూరు: నియోజకవర్గ బీజేపీ కన్వీనరుగా వేంపాటి విష్ణురావును నియమిస్తూ బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి పంపించిన ఉత్తర్వులు శుక్రవారం అందాయని ఆ పార్టీ నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి, ప్రధాన కార్యదర్శి గారపాటి సీతా రామాంజనేయ చౌదరి, ఏలూరు జిల్లా బీజేపీ అధ్యక్షుడు విక్రమ్ కిషోర్‌కు వేంపాటి ధన్యవాదాలు తెలిపారు.

ప్రాథమిక పాఠశాలల తనిఖీ

మండవల్లి: విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంలో కీలకపాత్ర పోషించాలని, ప్రభుత్వం కల్పిస్తున్న అన్ని రకాల సదుపాయాలను విద్యార్థులకు అందేవిధంగా చర్యలు తీసుకోవాలని ఉపాధ్యాయులకు ఎంఈఓ డి.రామారావు సూచించారు. నందిగామలంక, ఇంగిలిపాకలంక ప్రాథమిక పాఠశాలలను ఆయన శుక్రవారం తనిఖీ చేశారు. ఏకరూప దుస్తులు, మిడ్ డే మీల్స్, జగనన్న విద్యా కానుక కిట్లు అందరికీ వచ్చాయో, లేదో పిల్లలను అడిగి తెలుసుకున్నారు. స్కూల్ రికార్డులు తనిఖీ చేశారు.

అగ్నిబాధితురాలికి ఆర్థిక సాయం

ముదినేపల్లి రూరల్: అగ్నిప్రమాదంలో సర్వస్వం కోల్పోయిన బాధితురాలికి స్థానిక ప్రముఖ వైద్యుడు మనోజ్, ఆయన కుమార్తె వైద్య విద్యార్థిని వైష్ణవి శుక్రవారం ఆర్థిక సాయం అందజేశారు. ముదినేపల్లి శివారు అన్నవరానికి చెందిన ఈడే నాంచారమ్మ ఇల్లు దీపావళి రోజున విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో పూర్తిగా దగ్ధమైంది. సమాచారం తెలుసుకున్న డాక్టర్ మనోజ్ నాంచారమ్మను పరామర్శించి కుమార్తె వైష్ణవి తరపున రూ.10వేల ఆర్థికసాయాన్ని అందజేశారు.

ఆధ్యాత్మిక భావన పెంపొందించుకోవాలి

పామర్రు: ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక భావనను పెంపొందించుకోవాలని, అప్పుడే పల్లెలు శాంతి సామరస్యాలతో ఉంటాయని పామర్రు ఎస్ఐ ప్రవీణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. స్థానిక బొమ్మారెడ్డి సీతారెడ్డి కల్యాణ మండపంలో శ్రీ వేణుగోపాల భక్త సమాజం వారి చెక్క భజన, వడపప్పు కార్యక్రమం గురువారం రాత్రి కోతిబొమ్మ సెంటర్ ఫ్రెండ్స్ సర్కిల్ వారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఎస్ఐ ప్రవీణ్ రాముల వారిని దర్శించుకుని విశేష పూజలను చేశారు. అనంతరం భజన గురువు కొల్లి సత్యనారాయణరెడ్డి, ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ రెడ్డిలను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు ఆరేపల్లి శ్రీనివాసరావు, బొమ్మారెడ్డి కృష్ణారెడ్డి, బొమ్మారెడ్డి అప్పిరెడ్డి, తాడిశెట్టి శ్రీనివారావు, కందుల నరసింహారావు, మనోహర్‌రెడ్డి, కూసం పెద వెంకటరెడ్డి పాల్గొన్నారు.

దివ్యాంగ బాలలకు ట్యాబ్‌ల పంపిణీ

గుడివాడటౌన్: ప్రతి ఒక్కరికీ ఉత్తమ విద్య అందించాలనేదే ప్రభుత్వ లక్ష్యం అని గుడివాడ మండల విద్యాశాఖాధికారి ఇందుపల్లి విజయ్ అన్నారు. స్థానిక భవిత కేంద్రంలో శుక్రవారం దృష్టిలోపం, వినికిడి లోపం కలిగిన విద్యార్థులకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ట్యాబ్‌లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దృష్టిలోపం కలిగిన డి.సంతోష్, వినికిడి లోపం కలిగిన కె.యశ్వంత్ కుమార్ లకు ప్రత్యేక ట్యాబ్‌లు అందజేశామన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ–2 బి.బాలాజి, భవిత కేంద్రం ఇన్‌చార్జ్ ఎంకే నీలాంబరం , ఎస్‌కే ఫజుల్లా, విద్యార్థులు పాల్గొన్నారు.